గురువారం 30-5-2024

# ముందడుగు

సంపుటి: 1, సంచిక: 350, పేజీలు: 4 | ₹6
SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD
EPAPER.MUNDADUGU.COM
దినపత్రిక

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..
Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com



## దేశ చరిత్రలోనే రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు

### ఢిల్లీలో 52.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు

**ముందడుగు ఢిల్లీ:**

దేశ రాజధాని ఢిల్లీలో ఎండలు మండుతున్నాయి. దేశ చరిత్రలోని తొలిసారిగా రికార్డు స్థాయిలో ఢిల్లీ నగరంలోని మంగేష్‌పూర్‌లో 52.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఎడారి ప్రాంతమైన రాజస్థాన్ కంటే ఎక్కువగా రాజధాని ప్రాంతంలో ఎండలు దంచికొడుతున్నాయి. రాజస్థాన్‌లో అత్యధికంగా ఫలోడిలో 51 డిగ్రీలు ఉష్ణోగ్రత రికార్డయ్యింది. మరో వైపు మండుతున్న ఎండలతో ఢిల్లీలో విద్యుత్ వినియోగం విపరీతంగా పెరిగింది. 8,302 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఉన్నది. ఇంత పెద్ద మొత్తంలో విద్యుత్ డిమాండ్ రావడం ఇదే తొలిసారి. భారీగా పెరిగిన ఉష్ణోగ్రతలకు తోడు వేడిగాలులు వీస్తున్నాయి. దీంతో జనమంతా ఏసీలు ఎక్కువగా వినియోగించడంతో డిమాండ్ పెరిగిందని విద్యుత్ శాఖ అధికారులు పేర్కొన్నారు. భారత వాతావరణ శాఖ బుధవారం దేశంలోని వాయువ్య ప్రాంతాలకు రెడ్ అలెర్ట్ జారీ చేసింది. ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో 50 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డయ్యే అవకాశం ఉందని.. వేడిగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. మిగతా 2లో



### ముందుచూపులేని ముఖ్యమంత్రి

వివరాలు 4లో

## దేశంలో కాంగ్రెస్ హయాంలోనే కుంభకోణాలు

- అవినీతి తప్ప ఎక్కడ అభివృద్ధి జరగలేదు
- ఒడిషా ఎన్నికల ప్రచారంలో మోడీ

**ముందడుగు ఒడిషా:**



దేశంలో భారీ కుంభకోణాలు కాంగ్రెస్ హయాంలోనే జరిగాయని, అవినీతి తప్ప ఎలాంటి అభివృద్ధి జరగలేదని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఒడిషాలోని కేంద్రపారాలో బుధవారం జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీని ఉద్దేశించి మోడీ మాట్లాడారు. గత పదేండ్ల పాలనలో తమ ప్రభుత్వం దేశాన్ని అన్ని రంగాల్లో ప్రగతి బాట పట్టించిందని చెప్పారు. రాష్ట్రాన్ని లూటీ చేస్తున్న పాలకులకు బుద్ధి చెప్పాలని ఒడిషా ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. ఈసారి ఒడిషాలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని నెలకొల్పాలని ప్రజలు నిర్ణయించుకున్నారని పేర్కొన్నారు. ఒడిషాలోనే కాకుండా దేశంలో మరోసారి పటిష్ట ప్రభుత్వం రావాలని ప్రజలు కోరుకుంటున్నారని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించి మరోసారి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మిగతా 2లో

## కోటీశ్వరులను బలోపేతం చేయడమే వారి లక్ష్యం

- దేశంలోని సంపద అంతా బిలియనీర్లకే
- బిజెపిపై ప్రియాంక గాంధీ ఆరోపణలు

**ముందడుగు హిమాచల్ ప్రదేశ్:**



దేశంలో కోటీశ్వరులను బలోపేతం చేయడమే లక్ష్యంగా బీజేపీ పనిచేస్తుందని, దేశంలోని సంపద అంతా బిలియనీర్లకు నెమ్మదిగా అందజేస్తున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ఆరోపించారు. లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా హిమాచల్ ప్రదేశ్‌లోని కులులో జరిగిన బహిరంగ సభలో పాల్గొన్న ఆమె ప్రసంగించారు. విపక్ష ఇండియా కూటమి అధికారంలోకి రాగానే చిన్న తరహా పరిశ్రమలను ప్రోత్సహిస్తామని తెలిపారు. చిన్న తరహా పరిశ్రమల రంగంలో ఉద్యోగాలను కల్పిస్తామని అన్నారు. ప్రధాని మోదీ తన పాలనలో ఉపాధి కల్పనను పూర్తిగా మిగతా 2లో



### ఢిల్లీలో కారు కడిగితే 2000 జరిమానా

వివరాలు 3లో

### సెప్టిక్ ట్యాంక్‌లో బంగ్లాదేశ్ ఎంపీ మాంసపు ముద్దలు

వివరాలు 2లో

### 1200 మంది ఫోన్లు ట్యాప్ చేశాం

ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు అంగీకారం

వివరాలు 2లో



### ఆ దేశంలో లంచం తీసుకుంటే మరణశిక్షనే

వివరాలు 4లో

ముందడుగు
గురువారం, 30-5-2024, హైదరాబాద్

## దేశ చరిత్రలోనే రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు

మొదటిపేజీ తరువాయి

బుధవారం నుంచి రాజధానితో సహా పలు ప్రాంతాల్ల వేడిగాలులు, అత్యంత వేడిగాలుల పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని హెచ్చరించింది. మంగేశ్‌పూర్, నరేలా ప్రాంతాల్లో మంగళవారం 49.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మరో వైపు ఎండల నేపథ్యంలో ప్రభుత్వం నీటి సరఫరాను పరిమితం చేసింది. యమునా నదిలో నీటి మట్టం తక్కువగా ఉందని.. నగరంలో ఏ సమయంలోనైనా నిరంతరాయంగా నీటి సరఫరా ఉండదని..రోజుకు రెండుగంటలు సరఫరా ఉంటుందని తెలిపింది. నీటి సమస్య ఉన్నా లేకపోయినా.. ప్రజలంతా తప్పనిసరిగా నీటిని పొదుపుగా వాడుకోవాలని మంత్రి అతిషి కోరారు.

## కోటీశ్వరులను బలోపేతం చేయడమే వారి లక్ష్యం

మొదటిపేజీ తరువాయి

విస్మరించారని మండిపడ్డారు. బీజేపీ విధానాలను మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బీజేపీ విధానాలకు చిన్న పరిశ్రమలు చితికిపోయేలా ఉన్నాయని తెలిపారు. కాషాయ పాలకుల విధానాలతో చిన్న పరిశ్రమలు చిన్నాభిన్నం అవుతుంటే..మరో వైపు బిలియనీర్లు సంపద పోగేసుకుంటున్నారని దుయ్యబట్టారు. చిన్న, మధ్యతరగతి వ్యాపారాలను బలోపేతం చేయాలని అన్నారు. చిన్న తరహా పరిశ్రమలను ప్రోత్సహిస్తే వాటి ద్వారా చాలా మందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు.

## తెరుచుకున్న స్కూళ్లు.. సొమ్మసిల్లిన విద్యార్థులు

- విద్యార్థులకు సపర్యలు చేసిన టీచర్లు
- బీహార్‌లో 47 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు



**ముందడుగు బీహార్:** బీహార్‌లో వేసవి సెలవులు ముగియడంతో బుధవారం నుంచి ఆ రాష్ట్రంలో స్కూళ్లను తెరిచారు. అయితే ఉష్ణోగ్రత 47 డిగ్రీలు దాటడంతో ఎండ తీవ్రతను విద్యార్థులు తట్టుకోలేకపోయారు. పలు ప్రాంతాల్లోని స్కూళ్లలో విద్యార్థులు సొమ్మసిల్లిపోయారు. షేక్‌పురా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో 16 మంది బాలికలు స్పృహ తప్పి పడిపోయారు. టీచర్లు వారికి సపర్యలు చేశారు. ఆటోలు, బైక్‌లపై ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ బీహార్‌లో స్కూళ్లను తెరువడంపై విమర్శలు వెల్లువెత్తాయి. గ్రామస్తులు స్కూళ్లకు వెళ్లి టీచర్లతో ఘర్షణపడ్డారు. అలాగే రహదారిని దిగ్బంధించి నిరసన వ్యక్తం చేశారు. సీఎం నితీశ్ కుమార్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ స్కూళ్లను తెరువడంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించాయి. మరోవైపు బీహార్‌లో ప్రభుత్వం, ప్రజాస్వామ్యం లేదని, బ్యూరోక్రసీ మాత్రమే ఉందని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ విమర్శించారు. 'ఉష్ణోగ్రతలు 47 డిగ్రీలకు పైగా ఉన్నాయి. బీహార్ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు సరిగా లేవు. కానీ సీఎం చేతుల్లో ఏమీ లేదు' అని మండిపడ్డారు.

# 1200 మంది ఫోన్లు ట్యాప్ చేశాం

- ప్రధానంగా ప్రతిపక్ష నేతలపై నిఘా పెట్టాం
- నేతలు, జడ్జిలు, స్థిరాస్తి వ్యాపారుల ఫోన్లు ట్యాప్
- ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు అంగీకారం



**ముందడుగు తెలంగాణ:** తెలంగాణ రాష్ట్రంలో దాదాపుగా 1200 మంది ఫోన్లు ట్యాప్ చేసినట్లు ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు అంగీకరించారు. ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి ఆయన వాంగ్మూలంలో పేర్కొన్న కీలక విషయాలు బయటకు వచ్చాయి. ప్రధానంగా ప్రతిపక్ష నేతలపై నిఘా పెట్టామని, వారికి వెళ్లే డబ్బును అడ్డగించి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. నేతలు, జడ్జిలు, స్థిరాస్తి వ్యాపారుల ఫోన్లు ట్యాప్ చేసినట్లు అంగీకరించారు. కన్వర్జెన్స్ ఇన్నోవేషన్ ల్యాబ్ సాఫ్ట్‌వేర్ సాయంతో ట్యాపింగ్‌కు పాల్పడినట్లు తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ పర్యవేక్షణ కోసం 17 కంప్యూటర్లను వినియోగించామని, 56 మంది ఎస్ఓటీ సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ట్యాపింగ్ ఆపేయాలని ప్రభాకర్‌రావు నుంచి ఆదేశాలు అందినట్లు చెప్పారు. ఆయన రాజీనామా చేసే ముందు రికార్డులన్నీ ధ్వంసం చేయాలని సూచించినట్లు తెలిపారు. రికార్డులు ధ్వంసం చేసి కొత్తవాటిని అమర్చామని పేర్కొన్నారు. ధ్వంసం చేసిన ఆధారాలను నాగోలు, మూసారాంబాగ్ వద్ద మూసీ నదిలో పడేసినట్లు వెల్లడించారు. సీడీఆర్, ఐడీపీఆర్ డేటా మొత్తం కాల్చేసినట్లు పేర్కొన్నారు. ఫార్మాట్ చేసిన ఫోన్లు, పెన్‌డ్రైవ్‌లను బేగంపేట నాలాలో పడేసినట్లు తెలిపారు.

## కంటైనర్‌లో ఊపిరాడక 16 ఎద్దులు మృతి

### అక్రమంగా తరలిస్తున్న ముఠా పట్టివేత



**ముందడుగు సూర్యాపేట:** అక్రమంగా ఎద్దులను తరలిస్తున్న నలుగురు తమిళనాడు వాసులను సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లి చెక్‌పోస్టు వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీటిని తరలిస్తున్న కంటైనర్‌లో ఊపిరాడక 16 ఎద్దులు మృతి చెందినట్లు గుర్తించారు. మరో తొమ్మిదింటిని గోశాలకు తరలించారు. ఒక ఎద్దుకు చికిత్స అందిస్తున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సూర్యాపేట నుంచి ఏపీ వైపు వెళ్తుండగా కంటైనర్ పోలీసులకు పట్టుబడింది. మృతిచెందిన ఎద్దులకు పశువైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు.

## జూన్ 3 నుంచి లాసెట్

### మూడు సెషన్లలో పరీక్ష ▪ లాసెట్ కన్వీనర్ వెల్లడి

**ముందడుగు,స్టేట్ బ్యూరో:** లాసెట్, పీజీఎల్‌సెట్ పరీక్షను తెలంగాణ వ్యాప్తంగా వచ్చే నెల 3వ తేదీన నిర్వహించనున్నారు. మొత్తం మూడు సెషన్లలో ఈ పరీక్ష నిర్వహిస్తుండగా రెండు సెషన్లలో మూడేళ్ల లాసెట్ కోర్సుకు, చివరి సెషన్ లో ఐదేండ్ల లాసెట్ కోర్సు ప్రవేశానికి, పీజీఎల్ సెట్ కు ఎగ్జామ్ నిర్వహించనున్నారు. తొలి సెషన్ ఉదయం 9 గంటల నుంచి 10:30 వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 12:30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, మూడో సెషన్ సాయంత్రం 4 గంటల నుంచి 5:30 వరకు నిర్వహిస్తున్నారు. కాగా లాసెట్ కు మొత్తం 50,684 మంది దరఖాస్తు చేసుకున్నట్లు లాసెట్ కన్వీనర్ విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాగా ఇందులో మూడేండ్ల లాసెట్ కోర్సుకు 36,079 మంది, ఐదేండ్ల లాసెట్ కోర్సుకు 10,197 మంది దరఖాస్తు చేసుకున్నట్లు వెల్లడించారు. కాగా పీజీఎల్ సెట్ కు 4408 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలతిపారు. ఇదిలా ఉండగా రాష్ట్ర వ్యాప్తంగా లాసెట్ కు 68 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కాగా తొలి రెండు సెషన్లకు 68 కేంద్రాలుండగా మూడో సెషన్ కు 50 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు స్పష్టంచేశారు.

## 8 మందిని హత్య చేసి ఆత్మహత్య చేసుకున్నాడు

### మానసిక స్థితి కారణమని పోలీసుల అనుమానం



**ముందడుగు మధ్యప్రదేశ్:** ఓ వ్యక్తి తమ కుటుంబానికి చెందిన 8 మందిని హత్య చేశాడు. ఆ తర్వాత ఆ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మధ్యప్రదేశ్‌కు చెందిన చింద్వారా జిల్లాలోని బోదల్ కచ్చార్ గ్రామంలో జరిగింది. కుటుంబసభ్యులను హత్య చేసిన వ్యక్తి మానసికంగా స్థిమితంగా లేనట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రానికి వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆ గ్రామానికి చింద్వారా కలెక్టర్, ఎస్పీ వెళ్లారు. ఈ ఘటన పట్ల పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు. మంగళవారం రాత్రి కుటుంబసభ్యులపై అటాక్ చేసినట్లు ఎస్పీ ఖత్రి తెలిపారు. సోదరుడు, కోడలు, భార్యతో పాటు మరో చిన్నారిని కూడా ఆ వ్యక్తి హత్య చేశాడు. అందర్నీ హత్య చేసిన తర్వాత ఆ వ్యక్తి సమీపంలో ఉన్న ఓ చెట్టుకు ఉరి వేసుకున్నాడు. ఆ కుటుంబానికి చెందిన ఒక్క చిన్నారి మాత్రమే ఆ దాడిలో గాయాల వల్ల బయటపడ్డాడు. ప్రస్తుతం ఆ చిన్నారికి చికిత్స అందిస్తున్నారు. ఏ కారణం చేత ఆ వ్యక్తి హత్యకు పాల్పడ్డాడో తెలియదు. ఆ కోణంలో పోలీసులు విచారణ చేపడుతున్నారు.

ముందడుగు
గురువారం,
30-5-2024,
హైదరాబాద్

# సెప్టిక్ ట్యాంక్‌లో బంగ్లాదేశ్ ఎంపీ మాంసపు ముద్దలు

## ఫోరెన్సిక్ ల్యాబ్‌కు తరలించిన పోలీసులు

**ముందడుగు**

బంగ్లాదేశ్ ఎంపీ అన్వరుల్ అజీమ్ అనర్ (53) హత్య కేసులో దర్యాప్తు ముమ్మరంగా సాగుతున్నది. కోల్‌కతాలో జరిగిన ఈ హత్య కేసులో దర్యాప్తు అధికారులు కొంత పురోగతి సాధించారు. ఆయన హత్యకు గురైనట్లు అనుమానిస్తున్న అపార్ట్ మెంట్‌లోని సెప్టిక్ ట్యాంక్‌లో బెంగాల్ సీఐడీ దర్యాప్తు బృందాలు తాజాగా మాంసపు ముద్దలను గుర్తించాయి. మొత్తం మూడున్నర కిలోల మాంసం ముద్దలు, కొన్ని వెంట్రుకలు సెప్టిక్ ట్యాంక్‌లో లభ్యమైనట్లు ఓ దర్యాప్తు అధికారి వెల్లడించారు. వాటిని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు తరలించామని, డీఎన్ఏ పరీక్షల్లో ఆ శరీర భాగాలు అనర్‌కు చెందినవో కావో తెలుస్తుందని చెప్పారు. కేసు దర్యాప్తులో భాగంగా



ఆయన హత్యకు గురైన ఫ్లాట్‌లోని బాత్‌రూమ్ ద్వారా రక్తం మురుగు నీటి పైపులగుండా వెళ్లినట్లు భావించామని పోలీసు అధికారి తెలిపారు. హౌసింగ్ కాంప్లెక్స్ బాధ్యుల సహాయంతో ఆ మురుగునీటి పైపు లైన్లు, సెప్టిక్ ట్యాంకును పరిశీలించామని, ఈ క్రమంలోనే మాంసపు ముద్దలను గుర్తించామని చెప్పారు. హత్య చేసిన నిందితుడు వృత్తిరీత్యా కసాయి అని, ఎంపీని హత్య చేసిన అనంతరం శరీరాన్ని 80 ముక్కలుగా చేసి, వాటికి పసుపు కలిపి నగరంలోని బాగ్జోలా కాలువ, ఇతర ప్రాంతాల్లో పడేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

# స్కామ్ కాల్స్ పరిష్కారానికి కొత్త వ్యవస్థ

- 160 సిరీస్‌తో కూడిన నెంబర్లు జారీ
- కొత్తగా 10 అంకెల నెంబర్ సిరీస్

**ముందడుగు జాతీయం:**

దేశంలో రోజురోజుకు స్కామ్ కాల్స్ పెరుగుతున్న నేపథ్యంలో భారత టెలికాం విభాగం కొత్త పరిష్కారంతో ముందుకొచ్చింది. నకిలీ కాల్స్‌ను గుర్తించేలా కొత్త వ్యవస్థను రూపొందించింది. 160తో ప్రారంభమయ్యే 10 అంకెల నెంబర్ సిరీస్‌ను తీసుకొచ్చింది. ఇకపై ప్రభుత్వ, నియంత్రణ, ఆర్థిక సంస్థల నుంచి వచ్చే కాల్స్‌కు ముందు ఈ నెంబర్ ఉండనుంది. పది అంకెల నెంబర్ 160 ప్రిఫిక్స్‌తో పాటు 1600ABCXXX ఫార్మాట్‌లో ఉంటుంది. ప్రభుత్వ, ఆర్థిక సంస్థలతో పాటు టెలికాం నియంత్రణా సంస్థల నుంచి వచ్చే కాల్స్‌కు ఇది వర్తిస్తుంది. ఈ ఫార్మాట్‌లో 'AB' స్థానంలో టెలికాం సర్కిల్ కోడ్ ఉదాహరణకు ఢిల్లీ అయితే 11, ముంబయికి 22 ఉంటుంది. 'C' స్థానంలోని అంకె టెలికాం ఆపరేటర్ కోడ్‌ను సూచిస్తుంది.





XXX ప్లేస్‌లో 000999 మధ్య నెంబర్లు ఉంటాయి.

ఆర్‌బీఐ, సెబీ, పీఎఫ్ఆర్‌డీఏ, ఐఆర్‌డీఏ వంటి నియంత్రణా సంస్థల పరిధిలో ఉండే కంపెనీల నుంచి 1601ABCXXX ఫార్మాట్‌తో గల పది అంకెల సంఖ్య నుంచి ఫోన్ కాల్స్ వస్తాయి. ఈ కొత్త విధానం వల్ల యూజర్లకు కాల్స్ ఎక్కడి నుంచి వస్తున్నాయో ముందే పసిగట్టే అవకాశం ఉంటుంది. 160 సిరీస్‌తో కూడిన నెంబర్లను జారీ చేసే ముందు 'టెలికాం సర్వీస్ ప్రొవైడర్లు (TSP)' ఆయా సంస్థలను క్షుణ్ణంగా తనిఖీ చేసి ధ్రువీకరించుకోవాలని డీవోటీ సూచించింది.

# ఢిల్లీలో కారు కడిగితే 2000 జరిమానా

## తీవ్ర ఎండలతో పాటు నీటి కొరత



**ముందడుగు ఢిల్లీ:**

దేశ రాజధాని ఢిల్లీలో ఎండలు మండుతుండటంతో తీవ్ర నీటి కొరత నెలకొన్నది. ఈ నేపథ్యంలో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రభుత్వం అప్రమత్తమైంది. నీటి వృథాను అరికట్టే చర్యలు తీసుకోవాలని ఢిల్లీ జల బోర్డును ఆదేశించింది. దీంతో కార్లు కడుగడం వంటివి చేస్తే రూ.2,000 జరిమానా విధిస్తామని అధికారులు హెచ్చరించారు. ఎవరైనా నీటిని వృథా చేస్తే వారికి చలానా విధిస్తామని ప్రకటించారు. కార్లు, ఇతర వాహనాలను కడుగడం, నిర్మాణ, వాణిజ్య ప్రయోజనాల కోసం గృహ సరఫరా నీటిని వినియోగించడాన్ని అనుమతించబోమని పేర్కొన్నారు.

### ఢిల్లీలో నీటి వృథాను అరికట్టేందుకు, నిబంధనలు

ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు చేపట్టేందుకు 200 బృందాలను జల బోర్డు మోహరించనున్నది. ఉదయం 8 గంటల నుంచి ఈ బృందాలు దేశ రాజధాని ప్రాంతాల్లో తిరిగి నీటి వృథాపై దృష్టిసారిస్తాయి. అలాగే నిర్మాణ స్థలాలు, వాణిజ్య సంస్థల్లో ఉన్న అక్రమ నీటి కనెక్షన్‌లను నిలిపివేయాలని జల బోర్డు అధికారులను మంత్రి అతిషి ఆదేశించారు. తీవ్ర ఎండలతోపాటు హర్యానా నుంచి నీటి సరఫరా ఆగిపోవడం కూడా నీటి కొరతకు కారణమని అన్నారు.



## ఈవీ ఛార్జింగ్ నెట్ వర్క్ భాగస్వామం చెందిన

# ఎంజీ ఇండియా మరియు హెచ్ పీసీఎల్

**ముందడుగు హైదరాబాద్:**

స్థిరమైన సంచారం దిశగా తీసుకున్న చర్యలో భాగంగా, భారతదేశపు ఈవీ ఛార్జింగ్ మౌలిక సదుపాయాన్ని మెరుగుపరిచి మరియు సుసంపన్నం చేయడానికి తమ వ్యూహాత్మకమైన భాగస్వామాన్ని ఎంజీ మోటార్ ఇండియా మరియు హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్. (హెచ్ పీసీఎల్) లు ప్రకటించాయి. గౌరవ్ గుప్తా, ఛీఫ్ గ్రోత్ ఆఫీసర్, ఎంజీ మోటార్ ఇండియా మాట్లాడుతూ ”ఎలక్ట్రిక్ సంచారానికి విజయవంతంగా పరివర్తన చెందడానికి కీలకం దృఢమైన ఈవీ పర్యావరణ వ్యవస్థ ఉండాలి. ఈవీ రంగంలో ముందస్తు చర్యగా ఎంజీ శక్తివంతమైన ఈవీ పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి చేయడంలో ముందుంది అన్నారు. రాజ్ దీప్ ఘోష్, ఛీఫ్ జనరల్ మేనేజర్, హైవే రీటైలింగ్, హెచ్ పీసీఎల్ మాట్లాడుతూ “హెచ్ పీసీఎల్ కు దేశవ్యాప్తంగా 22000+ ఫ్యూయల్ స్టేషన్స్ నెట్ వర్క్ ఉంది మరియు కస్టమర్స్ కు పర్యావరణానుకూలమైన ఇంధనం కేటాయించడం ద్వారా సుస్థిరమైన భవిష్యత్తుకు కట్టుబడింది అన్నారు.

## కాంట్రాక్ట్ ఫార్మింగ్ సేవలను అందిస్తున్న సంస్థ

# గుజరాత్ చెందిన ఫ్రాంక్లిన్ ఇండస్ట్రీస్ లిమిటెడ్

Franklin Industries
Limited

**ముందడుగు హైదరాబాద్:**

గుజరాత్‌కు చెందిన ఫ్రాంక్లిన్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (BSE - 540190) వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకంతో పాటు కాంట్రాక్ట్ ఫార్మింగ్ సేవలను అందించే సంస్థ. ఈ సంస్థ జారీచేసిన రూ.38.33 కోట్ల రైట్స్ ఇష్యూ 2024 మే 24 నుంచి సబ్‌స్క్రిప్షన్ కోసం ఓపెన్ అయింది.

ఇష్యూ ద్వారా సమీకరించిన నిధులను వర్కింగ్ క్యాపిటల్ అవసరాలు, సాధారణ కార్పొరేట్ అవసరాలతో సహా కంపెనీ విస్తరణ ప్రణాళికలకు వినియోగించనున్నారు. మే 24, 2024 న ఒక షేరు ముగింపు ధర రూ .7.50 తో పోలిస్తే కంపెనీ రైట్స్ ఇష్యూ ప్రతి షేరుకు రూ. 3.58కే అందిస్తున్నారు. రైట్స్ ఇష్యూ 2024 జూన్ 11న ముగుస్తుంది.

ఈక్విటీ షేరుకు రూ.3.58 చొప్పున (ఒక్కో ఈక్విటీ షేరుకు రూ.2.58 ప్రీమియంతో కలిపి) రూ.1 ముఖ విలువ కలిగిన 10,84,50,000 పూర్తిగా చెల్లించిన రూ.38.83 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను కంపెనీ జారీ చేయనుంది. ప్రతిపాదిత ఇష్యూ కోసం హక్కుల అర్హత నిష్పత్తిని 3:1గా నిర్ణయించారు (రికార్డు తేదీ మే 13, 2024 న ఈక్విటీ వాటాదారులు కలిగి ఉన్న ప్రతి 1 పూర్తిగా చెల్లించిన ఈక్విటీ షేరుకు రూ. 1 ముఖ విలువ కలిగిన 3 రైట్స్ ఈక్విటీ షేర్లు). ఆన్‌మార్కెట్ హక్కులను వదులుకోవడానికి చివరి తేదీ 5 జూన్, 2024

ముందడుగు
గురువారం, 30-5-2024, హైదరాబాద్

మార్చి 2024న కేంబ్రిడ్జ్ పరీక్ష ఫలితాలు

# భారత్‌లో విడుదల

CAMBRIDGE

**ముందడుగు హైదరాబాద్:**

కేంబ్రిడ్జ్ యూనివర్శిటీ ప్రెస్ అండ్ అసెస్‌మెంట్ లోని ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ గ్రూప్ భారతదేశంలో మార్చి 2024 పరీక్షా సిరీస్ ఫలితాలను ఇటీవల ప్రకటించింది. దేశవ్యాప్తంగా 400 విద్యాసంస్థల నుంచి 15,000 కన్నా ఎక్కువ మంది విద్యార్థులు కేంబ్రిడ్జ్ ఐజీసీఎస్ఈ మరియు ఇంటర్నేషనల్ AS & A లెవెల్ ఫలితాలను పొందగా, ఇది భారతదేశంలో కేంబ్రిడ్జ్ నిర్వహించిన అతిపెద్ద మార్చి సిరీస్‌గా నిలిచింది.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తూ, కేంబ్రిడ్జ్ యూనివర్శిటీ ప్రెస్ అండ్ అసెస్‌మెంట్, దక్షిణాసియా మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్ రాజమణి మాట్లాడుతూ, "కేంబ్రిడ్జ్ ఐజీసీఎస్ఈ మరియు ఇంటర్నేషనల్ AS & A లెవెల్ పరీక్షలలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన విద్యార్థులందరికీ మరియు విద్యాసంస్థలకు మా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాము. వారి విజయం మా విద్యా సంఘంలోని ప్రతి ఉపాధ్యాయుడు, తల్లిదండ్రులు, సభ్యుల అచంచలమైన నిబద్ధతకు నిదర్శనం. కేంబ్రిడ్జ్ ఐజీసీఎస్ఈ కఠినమైన, అనువైన పాఠ్యప్రణాళిక ఈ యువ మనస్సులను విద్యాపరంగా రాణించేందుకు మరియు ముందుకు వచ్చే అనేక అవకాశాల కోసం వారిని సిద్ధం చేసిందని అన్నారు.

# ఆ దేశంలో లంచం తీసుకుంటే మరణశిక్షనే

## బ్యాంక్ అధికారికి ఉరిశిక్ష విధించిన చైనా ■ చైనా నిర్ణయం పట్ల ప్రపంచ వ్యాప్తంగా చర్చ

**ముందడుగు ప్రత్యేకం:**

ప్రభుత్వ అధికారులు ఎవరైనా అవినీతికి పాల్పడితే చైనా ప్రభుత్వం తీవ్ర స్థాయిలో చర్యలు తీసుకుంటుంది. లంచం తీసుకున్న ఓ బ్యాంక్ అధికారికి మరణిశిక్షను విధించింది. చైనా తీసుకున్న ఈ నిర్ణయం పట్ల ప్రపంచ వ్యాప్తంగా చర్చ కొనసాగుతోంది.

### చైనాలో అవినీతిపై ఉక్కుపాదం

చైనాలో అవినీతికి పాల్పడే అధికారులపై అక్కడి ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుంది. దోషులుగా తేలితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటుంది. ఈ క్రమంలో భారీ స్థాయిలో లంచాలు తీసుకున్న కేసులో ఓ బ్యాంక్ మాజీ ఆఫీసర్ దోషిగా తేలాడు. అతడిపై వచ్చిన అభియోగాలు నిజమేనని రుజువయ్యాయి. దీంతో అతడికి మరణ శిక్ష విధిస్తూ తూర్పు చైనాలోని ఓ న్యాయస్థానం తీర్పు వెల్లడించింది. మరో విషయమేమంటే అదే బ్యాంకుకు చెందిన ఓ ఉన్నతాధికారికి కూడా మూడేళ్ల క్రితం ఇదే కోర్టు మరణశిక్షను విధించింది.



### మరణశిక్ష విధిస్తూ తీర్పు

చైనా హువారోంగ్ ఇంటర్నేషనల్ హోల్డింగ్స్ అనేది చైనా హువారోంగ్ అసెట్ మేనేజిమెంట్ ఆఫ్ షోర్ కంపెనీ. ఇందులో బెయ్ తియాన్ హుయ్ అనే వ్యక్తి గతంలో జనరల్ మేనేజర్ గా పని చేశాడు.

ఆ సమయంలో ఆయన అధికారాన్ని అడ్డం పెట్టుకుని అనేక ప్రాజెక్టులకు అక్రమంగా అనుమతులు ఇచ్చారని, ఈ ప్రాజెక్టుల మాటున భారీ స్థాయిలో నగదు చేతులు మారిందని వెల్లడైంది. మొత్తం రూ. 1264 కోట్ల వరకు లంచం రూపంలో ఆయన తీసుకున్నట్లు రుజువు అయ్యింది. ఈ కేసు విషయమై విచారణ చేపట్టిన కోర్టు అతడికి మరణశిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించింది. ఈ తీర్పుపై అతను అప్పీల్ కు వెళ్తాడా లేదా అనే విషయంపై స్పష్టత లేదు. కానీ, మరణశిక్ష నుంచి బయట పడడం కష్టమని స్థానికంగా చర్చ నడుస్తోంది.

**మరుసటి నెలలో ఉరిశిక్షను అమలు**

చైనా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి జిన్ పింగ్ ఆ దేశంలో అవినీతి వ్యతిరేక చర్యలను ముమ్మరం చేశారు. ఈ క్రమంలో చాలామంది అవినీతికి పాల్పడిన అధికారులు పట్టుబడ్డారు. 2021 జనవరి నెలలో ఓ వ్యక్తికి మరణశిక్షను విధించింది. మరుసటి నెలలో అతడికి ఉరిశిక్షను అమలు చేసిన విషయం తెలిసిందే.

నిరంతరాయమైన, యూజర్లకు అనుకూలమైన

# ఇన్వెస్ట్‌మెంట్ సొల్యూషన్




**ముందడుగు హైదరాబాద్:**

ఫోన్‌పే ఉత్పత్తి అయిన షేర్.మార్కెట్ తన వినూత్నమైన ఇన్వెస్ట్‌మెంట్ సొల్యూషన్స్ వెల్త్‌బాస్కెట్స్‌పై దృష్టి సారిస్తోంది. వెల్త్‌బాస్కెట్స్ అనేది SEBIలో రిజిస్టర్ అయిన మా పరిశోధన విభాగం జాగ్రత్తగా ఎంపిక చేసినపలు స్టాక్‌లు, ETFల బాస్కెట్. ఒక పెట్టుబడిదారుడిగా మంచిపోర్ట్‌ఫోలియోను క్రియేట్ చేయడం కోసం, స్టాక్ మార్కెట్లో అందుబాటులో ఉన్న అనేక శ్రేణుల్లోని ఇన్వెస్ట్‌మెంట్ ఆప్షన్లను వెతుకుతూ, వాటిని ఎంపిక చేసుకోవడమనేది ఎల్లప్పుడూ పెద్దసవాల్‌తో కూడినదే. పెట్టుబడిదారుని ఆర్థిక లక్ష్యాలను సాధించడానికి ఏ ఆప్షన్ ఉపయోగపడుతుందోగుర్తించడం కూడా ఒక సవాల్‌గానే నిలుస్తుంది. వెల్త్‌బాస్కెట్స్ అనేవి యూజర్‌కు అనుకూలమైన పెట్టుబడిఉత్పత్తులు.. పెట్టుబడిదారులు నిమిషాలలో సైన్ అప్ చేసి, కేవలం ₹1000తో పెట్టుబడి పెట్టడాన్నిప్రారంభించవచ్చు. ఇది కొత్త వాళ్లు, అనుభవజ్ఞులు అనే తేడా లేకుండా, అందరికీ ఉపయోగపడే పెట్టుబడి ఉత్పత్తి. విభిన్నమైనఆప్షన్లు: వెల్త్‌బాస్కెట్‌అనేది ఏదైనా ప్రత్యేక స్టాక్‌ను ఎంపిక చేసుకోవడంలో, అలాగే దాన్ని పూర్తిగా విశ్లేషించడంలోఉన్న కష్టాలను తొలగించడమే కాకుండా, అనేక రకాల అసెట్ క్లాస్‌లు, సెక్టార్లు, థీమ్‌లు ,ఫ్యాక్టర్లను బట్టి విభిన్నమైన అవకాశాలను ఇస్తుంది. ఇది యూజర్ దగ్గర ఉన్న ప్రస్తుతహోల్డింగ్‌ను మరింత వైవిధ్యంగా మార్చడంలో సహాయపడుతుంది

# ముందుచూపులేని ముఖ్యమంత్రి

## తెలంగాణలో ప్రభుత్వం ఉన్నట్టా? లేనట్టా?

- విత్తనాల కోసం రైతులు పడిగాపులు కాస్తుంటే పట్టదా?
- ఎన్ని ఎకరాలకు విత్తనాలు అవసరమో లెక్క అవసరం లేదా?
- రైతులతో కలిసి ఉద్యమాలు చేస్తాం ● బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**ముందడుగు,స్టేట్ బ్యూరో:**

రాష్ట్రంలోని రైతులకు విత్తనాల పంపిణీ చేస్తున్న తీరు పట్ల మాజీ మంత్రి, భారతీయ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విత్తనాలు తీసుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఆయన ఈ మేరకు ట్వీట్ చేశారు. విత్తనాల పంపిణీకి సంబంధించి ఇబ్బందులను చెబుతూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులకు సంబంధించిన వీడియోను పోస్ట్ చేస్తూ ట్వీట్ చేసిన కేటీఆర్.. ప్రభుత్వ తీరు పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఉన్నట్టా..? లేనట్టా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. విత్తనాల కోసం రైతులకు వెతలు తప్పడం లేదని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. విత్తనాల పంపిణీ ప్రక్రియను పర్యవేక్షించాల్సిన వ్యవసాయ శాఖ మంత్రి ఎక్కడ ఉన్నారన్న కేటీఆర్.. ముందు చూపు లేని ముఖ్యమంత్రి జాడేదని ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారంలో తిరగడం తప్ప.. ఎన్ని ఎకరాలకు విత్తనాలు అవసరమో లెక్క లేదా..? అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం అమ్ముకుందామంటే కొనేవాడు లేక రైతులు ఇబ్బందులు పడ్డారని, విత్తనాలు కొందామంటే ప్రస్తుతం అమ్మేవాడు లేక రైతులు అవస్థలు పడుతున్నారని కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాలన పూర్తిగా పడకేసిందని చెప్పడానికి ఇంతకన్నా నిదర్శనం ఇంకేం కావాలని కేటీఆర్ ప్రశ్నించారు. సాగునీరు ఇవ్వడం చేతకాక పంటలను ఎండగట్టారని, ఇప్పుడు విత్తనాలు అందించే విజన్ కూడా లేదా అని దుయ్యబట్టారు. గడిచిన 10 ఏళ్లలో రైతులకు 10 నిమిషాల్లో విత్తనాలు అందించామని, ప్రస్తుతం 10 గంటలపాటు పడిగాపులు పడిన అందించలేరా అంటూ కేటీఆర్ అసహనం వ్యక్తం చేశారు. రంగారెడ్డి నుంచి కామారెడ్డి దాకా రైతులకు విత్తనాలు కష్టాలు తప్పడం లేదని, ఇంకెన్నాళ్లపాటు ఈ కన్నీళ్లు అని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. దేశంలోని ప్రజల కడుపు నింపే స్థాయికి ఎదిగిన తెలంగాణ.. ప్రస్తుతం అన్నదాతకే తిండి తిప్పలు లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సరిపడా విత్తనాలు స్టాక్ తెప్పించాలని, బ్లాక్ మార్కెట్ కు తరలించకుండా కళ్లెం వేయాలని కేటీఆర్ ప్రభుత్వానికి సూచించారు. అన్నదాతలను అరిగోస పెట్టకుండా చూడాలని కోరిన కేటీఆర్.. లేకపోతే రైతుల సంఘటితశక్తిలో ఉన్న బలాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం చవిచూడక తప్పదని హెచ్చరించారు.